

# ఎర్రని కథ

-నలిమెల భాస్కర్

ఓ వర్తమాన కవి గులాబి పూల గురించి కవిత్వం రాయాలనిపించి, వాటికై అన్వేషణ సాగించాడు.

చుట్టుపక్కలంతా వెతికినా గులాబి మొక్కలు కన్పించలేదు. నగరానికి వెళ్ళితే కావలసినవన్నీ కన్పించాయి. కాని అన్నీ ముళ్ళ కంచె, కాంపౌండ్ గోడల్లో బందీలుగా వున్నాయి. కొమ్మలూ రెమ్మలూ కత్తిరించబడి పొట్టిగా పూలతోట్లలో యజమానుల ఆజ్ఞానుసారం పెరిగి పుష్పిస్తున్నాయి.

ఓ ధనవంతుడి బంగళా కాంపౌండు గోడలో గులాబి మొక్కల్ని చూసి ఆకర్షితుడై వర్తమాన కవి నిలబడిపోయాడు. గేటు మూయబడి అక్కడ ఓ బోర్డు వేలాడదీయబడి వుంది. "లోనికి ప్రవేశించరాదు" కవికి లోనికి వెళ్ళకుండా వుంటానికీ, పూలని దగ్గర్నించి చూడకుండా వుంటానికీ సాధ్యం కాలేదు. గేటు సందులోంచి అతి ప్రయాసతో దూరాడు.

ఎదురుగా పెద్ద బంగళా నోరు తెరిచి చూస్తోంది. దాని ముందు చిన్న చిన్న గులాబి మొక్కల తోట, గులాబి మొక్కలు తెలుపు, పసుపు, ఎరుపు రంగుల పూలతో చల్ల గాలికి తలలూపుతున్నాయి. ముందుకు నడుస్తూ కవి సంతోష స్వాంతుడై చూస్తున్నాడు. ఈలోగా "కవిగారు వచ్చారు. కవి గారు వచ్చారు" అంటూ గులాబి మొక్కలు ఆనందంతో అరిచాయి.

మొక్కల మొదళ్ళలో పురుగుల్ని ఏరుకు తింటోన్న పిచ్చుక ఈ మాటలు విని "ఎక్కడ... ఎక్కడ?" అంటూ కొమ్మ మీది నించి మరో కొమ్మ మిదకి దూకింది. గులాబి మొక్క "ఓ... అక్కడ... ఇటే వస్తున్నాడు చూడు. పిచ్చుకా! పిచ్చుకా! నీవు మనందరి తరపున స్వాగతం పలుకు" అంది. పిచ్చుక రివ్వున ఎగిరి కవిని ఆహ్వానించింది. "చివ్... చివ్" అంటూ కవి చుట్టూ ప్రదక్షిణం చేసింది. "కవి గారికి స్వాగతం... కవి గారికి స్వాగతం" అంది. కవి సంతోషించి ముందుకు నడిచాడు. ఒకటి, రెండు అడుగులు వేశాడో లేదో ధనవంతుని బంగళా కావలి కుక్క గోల చేస్తూ పరుగున వచ్చింది. "ఎవరు నీవు? ఇక్కడి కెందుకొచ్చావు? మా యజమాని ఇంటి వస్తువుల్ని దొంగిలించడానికా? వెళ్ళు ఇక్కణ్ణించి. పోకపోతే నిన్ను కరిచి చీల్చి చెండాడుతాను" అంది. కవి కావలి కుక్క గోలతో అదిరిపోయాడు. అది బలిష్ఠమైన కుక్క. దాని కళ్ళల్లో నిప్పులు దూకుతున్నాయి. ధైర్యాన్ని కూడబలుక్కుని "నేను వెళ్తాను మహారాజా... ఇలా గొడవ చేయకు. వెళ్ళే ముందు నా మాట విను. నేను ఓ కవిని. ఈ తోటలోని గులాబి పూల గురించి కవిత్వం రాయాలని వచ్చాను. నేను దొంగని కాను, మీ యజమాని వస్తువులేవీ నాకొద్దు" అన్నాడు కవి.

గులాబి మొక్కలూ శ్రుతి కలిపి "కుక్కా! కుక్కా! మన అభిమాన కవిగారు మన గురించి కవిత్వం రాస్తారట. మన యజమాని ఇంటి వస్తువేదీ ఆయనకు అవసరం లేదు. గొడవ చేయకు" అన్నాయి. కుక్క కిమ్మనకుండా కూచుంది. మళ్ళీ "ఏం చేస్తావో నేనిక్కడే వుండి చూస్తాను" అంది. కవి గులాబి మొక్కల్ని కృతజ్ఞతాపూర్వకంగా చూశాడు.

ఓ తుమ్మెద "గుంయ్..." అంటూ ప్రణయ గీతం ఆలపిస్తూ గులాబి మొక్క మీద కూచుని పువ్వుని ముద్దాడింది. మొక్క మొలక నవ్వులతో సిగ్గిల్లి "ఛీ!... సిగ్గులేని వారు చూడండి. అదుగో కవి మన గురించి కవిత్వం రాయాలని వచ్చారు. అతని ముందే... ఇదంతా ఏమిటి?" అంది. తుమ్మెద కూడా లజ్జతో కుంచించుకుపోయి "క్షమించు. మళ్ళీ వస్తాను" అంటూ ఆకుల మాటున తల దాచుకొన్నాడు. కవికి ఈ సయ్యాట నవ్వు తెప్పించింది.

చల్లగాలికి తలలూపుతోన్న మొక్కల్నీ, వికసిస్తోన్న పూలనీ తదేకంగా చూస్తే... ఈ మొక్కల్లో ముందటి ఉత్సాహం కన్పించడం లేదు. "మీలో ఇప్పుడు మునుపటి ఉత్సాహమూ, మాధుర్యమూ గోచరించడం లేదు. అలసి చిక్కిపోయినట్లు కన్పిస్తున్నారు... ఏమైంది మీకు?" అని అడిగాడు కవి.

హృదయాన్ని చదవగల కవులతో తాము అనుభవించే వేదనల్నీ, బాధల్నీ దాచి పెట్టడంలో అర్థం లేదనుకొని ఓ గులాబి మొక్క కారణం చెప్పసాగింది.

"ఓ ఆపద్బాంధవా! ఈ నా స్థితికి కారణం నేవింకా బానిసత్వంలో బతుకునీడ్చడమే! స్వేచ్ఛగా నేల తల్లి ఒడిలో వేళ్ళని దించి జీవించడానికి ఈ జనం అనుమతించడం లేదు. నేను ఓ తొట్టెలో బందీనై యజమాని వేసే అన్నం కోసం ఎదురు చూస్తూ కూచోవాలి. ఎత్తుగా పెరగడానికీ స్వతంత్రురాలిని కాను. యజమాని కూతురి చేతికందేంత వరకే పెరగాలి. అంతకన్న ఏపుగా పెరిగితే కత్తెరతో తోటమాలి నిర్దయగా నా చేతుల్ని నరుకుతాడు. యజమాని కూతురి చేతి కందేట్టు పుష్పించి జీవిస్తున్నాను. ఇది నా బతుకు గొడవ" అంది.

గులాబి మొక్క బాధని తామూ పంచుకొంటూ పిచ్చుకా, కావలి కుక్కా వింటూనే కళ్ళ నీళ్ళ పర్యంతమయ్యాయి. కవి హృదయంలో తుపాను రేగింది. మనస్సు అల్లకల్లోలమైంది. తన బాధని మిత్రులతో పంచుకొంటోన్న మొక్కని చల్లగా ప్రేమగా ఒళ్ళు నిమిరి ఓదార్చగానే... మొక్క ఉల్లాసంతో తేలికపడింది... పులకితగాత్ర అయింది. తన లేత కొమ్మకి ఓ అందమైన పువ్వు వికసించింది.

"ప్రియమైన కవీ! నా వ్యథని నీతో చెప్పకోడంతో నేనెన్నడూ అనుభవించని ఉల్లాసాన్ని పొందాను. నా బ్రతుకులోని తియ్యని ఈ క్షణాల గుర్తు కోసం మీకు చిన్న కానుకగా ఈ పువ్వుని ఇస్తున్నాను. దయతో స్వీకరించండి" అంది గులాబి మొక్క. అంతలోపే యజమాని కూతురు కావలి కుక్కని వెదుకుతూ అక్కడికొచ్చింది. కుక్క కవిని మొక్కల్లో దాక్కోమని సలహా ఇచ్చింది. కవి మొక్కల్లో దాక్కొని తొంగి. చూస్తున్నాడు.

"టామీ! నిన్ను ఎక్కడని వెదికానో తెలుసా? వెతికి వేసారి పోయాను. అక్కడ నీ కోసం బ్రెడ్ తెచ్చాను. చూడు" అంటూనే గులాబి మొక్కల్లో అంతకు ముందే పూచిన అపూర్వమైన పువ్వుని చూసి గంతులేసింది. "ఎంత అందమైన పువ్వు! నేనింతవరకూ ఇలాంటి పువ్వుని చూడనే లేదు" అంటూ పువ్వుని తుంచడానికి తయారైంది.

గులాబి మొక్క తల్లడిల్లుతూ "అలా చేయకు చెలీ!" అంటూ అంగలార్చింది. ఆ అమ్మాయికి అది వినిపించనే లేదు. ముందు కదుగేయగానే కావలి కుక్క అడ్డంగా నించుంది.

"టామీ! నీవు తమాషా చేయకు. వెళ్ళి బ్రెడ్ తిను. నేను ఈ పువ్వుని తెంపుతాను. ఎంత అందమైన పువ్వు చూడు" అంటూ అమ్మాయి మళ్ళీ ముందుకు నడిచింది

కుక్క కోపంతో "భౌ... భౌ... గుర్..." అంది. అమ్మాయి "ఈ కుక్కకి ఏమైంది? విడువు నన్ను టామీ!" అంది.

"చూడు. ఈ పువ్వుని తెంచవద్దు. అది కవికి సమర్పించబడింది. దాన్ని ముట్టితే నిన్ను యజమాని కూతురని కూడా చూడను" అంది కుక్క. అమ్మాయికి అర్థం కాలేదు. మళ్ళీ పువ్వుని తెంపబోయేలోగా ఛంగున దూకి అమ్మాయి చేతిని కరిచింది. మ్యాక్సీని చించి పోగులు పెట్టింది. అమ్మాయి "అయ్యో! నాన్నా! కుక్క... నన్ను చంపుతోంది, అయ్యో!" అంటూ మొత్తుకొంది.

బంగళాలోంచి యజమాని గొంతు వినిపించింది. ఆయన తుపాకీ బయటకొచ్చింది. రివ్వాల్వర్ అది "ఢం... ఢుం" అంటూ నిప్పులు చిమ్మింది.

కావలి కుక్క అల్లంత దూరంలో ఎగిరి పడింది. దాని ఎద గుండుతో గాయమై రక్తం జివ్వున చిమ్మి గులాబి మొక్క మొదట్లో రక్తం మడుగుకట్టింది.

కవి చూస్తూండగానే అపూర్వ సుందరమైన పువ్వు నెత్తుటి రంగు గులాబీలా మారిపోయింది. గులాబి మొక్క రక్తపు రంగు నీటిని చూసి విస్తుపోయింది. విషయం తెలిసి భోరున విలపించింది. దాని కొమ్మ కొమ్మకీ నెత్తుటి రంగు పూలు పూచాయి.

కవి హృదయంలో అగ్నిపర్వతం బద్దలైంది. కవిత్వపు లావా బయటికి చిమ్మింది. వర్తమాన కవి గులాబి మొక్క నించి ఓ ముల్లు తెంచి రక్తంతో అద్ది తన కవితకి శీర్షిక నిర్ణయించాడు.

"రుధిర గీతం".



"నాతో కలిసి భోజనం చేయడానికి ఏమైనా అభ్యంతరమా?" అడిగాడు అవినాష్

"ఏం లేదు.. తప్పకుండా కలిసే భోంచేద్దాం" చెప్పాడు వినాష్.

"అయితే మీ ఆవిడ్ని వంట తయారుచేయమను. నేనూ వస్తా"

— బి.వెంకటేశ్వరరావ్, హైదరాబాద్

## ● బాబా చెప్పిన కథలు

# బ్రహ్మతత్వం

ఓ చిన్న వూరిలోకి ఓ మహాత్ముడు వచ్చాడు. ఆ ఊరిలోని ధనవంతుని ఇంటికి, అతని స్నేహితులు అంతా కలిసి ఆ మహాత్ముడ్ని తీసుకు వెళ్ళారు.

ధనవంతునికి వేదాంతం యొక్క సారాంశాన్ని చెపుతూ, ఏదో సందర్భంలో "మీకు దృష్టి దోషం వచ్చింది. మీ కంటి చూపు దేని మీదా పడటం లేదు. కొంత కాలం ఏదో ఓ పచ్చరంగు చూస్తూ వుంటే నీ దృష్టి దోషం సరి అవ్వచ్చు" అంటూ చెప్పి వెళ్ళిపోయాడు.

ఆయన వెళ్ళిన మరునాడే అంతా అర్థం చేసుకున్న వాడివలె ధనవంతుడు తన పరివారాన్నీ, వూరిలోని మిగతా ముఖ్యులనూ పిలిపించి, తన ఇంటికి ఆ పరిసర ప్రాంతాలలోని అన్ని ఇళ్ళకు చెట్టు చేమలకు, పుట్టలకు, అది ఇది అని లేకుండా సమస్త వస్తువులకు వీలైనంతగా పచ్చ రంగు వేయించవలసిందిగా ఆజ్ఞాపించాడు. దానికి అయ్యే ఖర్చు అంతా తానే భరించడానికి కూడా సిద్ధపడ్డాడు.

అంతే! ఇదేదో బాగానే వుంది అనుకుంటూ ఆ వూరి ప్రజలందరూ ఒప్పుకుని ఆ వూరిలోని కార్మికులకూ, ఆ చుట్టుపక్కల వున్న మరికొంత మంది కార్మికులకూ ఉపాధి సౌకర్యం కల్పించి రంగు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలా ఆ వూరు అంతా చెట్టు చేమలతో సహా గోడలు, కట్టడాలు అన్నీ పచ్చగా మారిపోయాయి.

మరి కొంత కాలానికి ఆ చెప్పిన సత్పురుషుడు ఆ గ్రామం రావడం జరిగింది. పరిసరాలను చూచి ఆశ్చర్యపోయాడు. "ఏమిటి అంతా పచ్చగా మారిపోయింది!" అనుకుంటూ వూరి ప్రజలను పిలిచి విషయమేమిటి అని అడిగాడు. వారు అంతా వివరంగా చెప్పారు. కారణం తానేనని తెలుసుకుని ఎంతో కించపడ్డాడు. ఏకా ఏకిన ధనికుడ్ని కలిశాడు.

ధనికుడు ఎంతో ఉత్సాహంతో ఆనంద పడుతూ "హ దృష్టి దోష నివారణకు అంతా మీరు చెప్పినట్టుగానే చేశాను, ఎంత ఖర్చు అయినా పరవాలేదు అని. నా దృష్టి దోషం పోవడానికి వీలైనంతగా పచ్చరంగు వేయించుకుని చూస్తున్నాను.

ఇప్పుడు ఎలా వుందో నా దృష్టిని పరీక్షించి చూడండి స్వామీ" అంటూ ప్రాధేయ పడ్డాడు.



ఆ అమాయకత్వానికి నవ్వాలో ఏడవాలో తెలియక ఆశ్చర్యపోవడం ఆ మహాత్ముడి వంతు అయింది.

శాంతంగా తనను తాను కొంత నిభాళించుకుని "అయినా ఇంత స్వల్ప విషయానికి, ఇంత హైరానాపడి, ఇంత ధనాన్ని దండుగ చెచ్చించాలా? పచ్చ రంగును పూయించాలా? హాయిగా ఓ పది రూపాయిలు ఖర్చుపెట్టి ఓ రంగు కళ్ళజోడు కొనుక్కుని కళ్ళకు పెట్టుకుంటే సరిపోదా!" అంటూ తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ సున్నితంగా మందలించాడు.

శ్రీ పుట్టపర్తి సత్యసాయి మనకు ఈ కథ చెపుతూ చూశారా అంతా మన దృష్టిలోనే వుంది లోపం.

మన దృష్టిలో బ్రహ్మతత్వం ఏర్పరచుకుని చూచినప్పుడు ఈ సృష్టి అంతా సమత్వంతో గోచరిస్తుంది. అదే ఆనందదాయకమైన పచ్చదనం అంటూ బోధిస్తారు. ●